నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 | శనివారం 30 మార్చి 2024 | WARANGAL HANUMAKONDA



# రైతన్నా.. నేనున్నా..

**ఎండుతున్న పంటల పరిశీలనకు వస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

**రేపు జనగామ జిల్లా దేవరుప్పులలో 'క్షేత్ర' పర్యటన**

**రైతులతో మాట్లాడి ధైర్యమిచ్చేందుకు రాక..**

*స్వయంగా రైతు అయివుండి, ఎప్పుడూ రైతుల మేలు కోసమే పరితపించి, తన పదేళ్ల పాలనలో రైతును రాజుగా నిలబెట్టిన బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నీళ్లందక పంటలు ఎండిపోయి దిగులు చెందుతున్న రైతుల్లో ధైర్యం నింపేందుకు వస్తున్నారు. కరువుతో కన్నీరు పెడుతున్న రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో చూసి అన్నదాతలకు అభయమివ్వనున్నారు. పంటల పరిశీలనలో భాగంగా ఈ నెల 31న జనగామ జిల్లా దేవరుప్పులలో ఆయన పర్యటించి రైతులతో మాట్లాడనున్నారు.* – జనగామ, మార్చి 29 (నమస్తే తెలంగాణ)



పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలంలో నీళ్లందక ఎండిన పంటలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకొని ఓదార్చనున్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎర్రటి ఎండల్లోనూ నిండు కుండల్లా మత్తళ్లు దుంకిన చెరువులు, కుంటల్లో ఇప్పుడు నీటి జాడలు రోజురోజుకూ అడుగంటుతున్నాయి. బోరు వేస్తే 80 ఫీట్ల లోతు లోంచే ఉబికి వచ్చిన గంగమ్మ ఇప్పుడు 1.8 మీటర్ల లోతుకు పడిపోయింది. మొన్నటిదాకా పచ్చగా కళకళలాడిన పంటలకు సాగు నీరందక ఎండిపోయి నేలలు నెర్రెలు బారుతున్నాయి. తెలంగాణ ఏర్పడక ముందు ఉన్న పరిస్థితులు మళ్లీ రాబోతున్న ఛాయలు కనిపిస్తున్నాయి. నీటి ఊటలు పాతాళంలోకి జారిపోతుంటే రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. అదనులో మడులకు తడులందక నెర్రెలువారి పైరు వాలిపోయి పచ్చటి పంటలు కళ్ల ముందే ఎండుతుంటే రైతు గుండె అవిసిపోతున్నది. పూర్తిగా ఎండిపోతే ఎందుకూ పనికి రాదని చేసేదేం లేక పశువులు, జీవాలను మేతకు వదులుతున్న దుస్థితి కనిపిస్తున్నది. జనగామ జిల్లాలో ప్రస్తుత యాసంగిలో 2 లక్షల ఎకరాల్లో వరి వేయగా ఎనిమిదేళ్ల తర్వాత కరువు మళ్లీ తరుముకొస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### మొన్నటిదాకా కళ కళ.. నేడు కరువుకు చేరువ

ఉమ్మడి వరంగల్‌లో కరువుకు చిరునామాగా.. సముద్ర మట్టానికి 550 మీటర్ల ఎత్తయిన ప్రాంతంగా.. డార్క్ ఏరియాగా ముద్ర పడి బోర్లువేసేందుకు, ఇసుక తీసేందుకు వీళ్లేని నిషేధాజ్ఞలకు గురై అతి దుర్భిక్షాన్ని ఎదుర్కొన్న జనగామ, తెలంగాణలో కేసీఆర్ సర్కారు ఏర్పడిన తర్వాత దేవాదుల రూపంలో వచ్చిన గోదావరి నీటితో ఆకుపచ్చని చీరె కట్టుకుంది. నిన్నమొన్నటి దాకా దేవాదుల నీటితో సస్యశ్యామలంగా మారి, కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వందరోజుల్లోనే కరువుకు చేరువైంది. కరెంటు, నీళ్ల కటకటతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. సాగు నీరందక చాలా ప్రాంతాల్లో ఎండిన పొలాలు దర్శనమిస్తున్నాయి. పంటలను పశువులకు వదిలేస్తున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. ప్రస్తుత యాసంగికి దేవాదుల ద్వారా సాగునీళ్లు వదలక భూగర్భ జలాలు కూడా రీఛార్జ్ కాలేదు. బోర్లు కూడా వట్టిపోతున్నయ్. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జనగామ జిల్లాకు దేవాదుల నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో జిల్లాలోని 7 రిజర్వాయర్లకు గాను నర్మెట మండలం బొమ్మకూరు, లింగాలఘనపురం మండలం నవాబుపేట, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఆర్ఎస్ ఘన్‌పూర్, రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. వర్షపాతం తక్కువగా ఉండే జనగామ ప్రాంతంలో తెలంగాణ వచ్చిన తర్వాత దేవాదుల ప్రాజెక్టు నుంచి ఆయా రిజర్వాయర్లకు గోదావరి నీటిని సరఫరా చేసి కాలువల ద్వారా చెరువులు, కుంటలు, ఇతర చిన్ననీటి వనరులు నింపడం వల్ల ఎండ కాలంలోనూ నిండుగా మారి భూగర్భజలాలు సమృద్ధిగా ఉండేవి. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 797 చెరువులు, కుంటలు ఉంటే వాటిలో 199 వనరుల్లో నీటి మట్టాలు 25 శాతానికి పడిపోయాయి. మరో 62 నీటి వనరుల్లో 25 నుంచి 50శాతానికి, మరో 75 నీటి వనరుల్లో 50 నుంచి 100శాతం పడిపోయాయి. జిల్లాలో కేవలం 400 చెరువుల్లో మాత్రమే ప్రస్తుతం నీటి జాడలు కనిపిస్తున్నాయి. గతంలో 90 శాతానికి పైగా గ్రామాల్లో నీటి వనరులన్నీ దేవాదుల నీటితో నింపి పంటలకు సాగునీరందడం సహా భూగర్భ జల మట్టం పెరిగి బోర్లు వేసినా..బావులు తవ్వినా 80 నుంచి 100 ఫీట్ల లోపు నుంచే నీళ్లు ఉబికి వచ్చేవి. ప్రస్తుత ప్రభుత్వం యాసంగిలో దేవాదుల నీటిని విడుదల చేయక చెరువులు, కాలువలు ఎండిపోయి. బోరు బావులు వట్టిపోయి వరి, మక్క వంటి పంటలు ఎండుతున్నాయి. జనగామ జిల్లాలో కేవలం నెల వ్యవధిలోనే దారుణంగా 1.8 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయి కరువు ఛాయలు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో ఎండుతున్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వారికి ధైర్యాన్ని ఇచ్చేందుకు కేసీఆర్ దేవరుప్పులకు వస్తున్నారు.

హనుమకొండ, మార్చి 29 : 'కుట్రలు, కుతంత్రాలు చేసి అధిష్టానానికి తప్పుడు సమాచారమిస్తూ, నీచమైన రాజకీయాలు చేసిన వ్యక్తి కడియం శ్రీహరి.. గులాబీ వనంలో చీడ పురుగులాంటోడు.. నిత్యం నీతులు చెప్పే ఆయన ఇప్పుడైనా పాటించాలి.. ఏ పార్టీలో ఉన్నా స్వలాభం, రాజకీయ ఎదుగుదల కోసం ఆ పార్టీలో తన కన్నా ముందునుంచి ఉన్న నాయకులు, కార్యకర్తలను కడియం అణచివేసిన సందర్భాలు అనేకం ఉన్నయ్' అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ధ్వజమెత్తారు. హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.



హనుమకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, చిత్రంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి

# గులాబీ వనంలో చీడ పురుగు కడియం

## ఆయనది నీచ చరిత్ర.. అవకాశవాది

**నీతి, నిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి**

**బ్లాక్ మెయిల్ తోనే పదవులు అనుభవించారు.. దళితులు ఎదగకుండా కుట్రలు చేశారు**

**కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఫైర్**

**బీఆర్ఎస్‌లో పరిణామాలకు శ్రీహరే బాధ్యుడు : పెద్ది సుదర్శన్‌రెడ్డి**

కడియం శ్రీహరి అవకాశ వాది అని, ఆయనది నీచ చరిత్ర అని దాస్యం మండిపడ్డారు. నైతికత, నీతి, నిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31న నిర్వహించనున్న వరంగల్ పార్లమెంటరీ సమావేశం గురించి చర్చించేందుకు గురువారం సాయంత్రం కడియం నివాసానికి వెళ్లినప్పుడు కూడా పార్టీ మారే విషయం చెప్పలేదన్నారు. ఆ తర్వాత కడియం కావ్య వరంగల్ ఎంపీ అభ్యర్థిగా తప్పుకుంటున్నట్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పంపిన లేఖ వాట్సాప్‌లో చక్కర్లు కొట్టడం చూసి ఆశ్చర్య పోయానని తెలిపారు. కడియం టీడీపీలో ఉన్నప్పుడు చంద్రబాబును బ్లాక్ మెయిల్ చేసి అనేక పదవులు అనుభవించారని గుర్తుచేశారు. ఎదుగుతున్న దళిత నాయకులపై కుట్రలు చేసి, చాడీలు చెప్పిన నీచమైన చరిత్ర ఆయనదని విమర్శించారు. శ్రీహరిని కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ కోసం తానూ, కేటీఆర్, పెద్ది నిస్వార్థంతో పార్టీలోకి ఆహ్వానించామన్నారు. బీఆర్ఎస్‌లోకి రాగానే విజయరామారావు, రాగమళ్ల పరమేశ్వర్, దొమ్మాటి సాంబయ్య, పసునూరి దయాకర్, అరూరి రమేశ్‌లు కడియం రాజకీయానికి బలైపోయారన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రాజయ్యను కాదని కడియంకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే కాంగ్రెస్‌తో కుమ్మక్కై, ప్యాకేజీలు మాట్లాడుకొని బీఆర్ఎస్‌కు ద్రోహం చేశాడని మండిపడ్డారు. 'నీతి, నిజాయితీ అని బ్లాక్ మెయిల్ చేసి నీ బిడ్డ కోసం వరంగల్ ఎంపీ టికెట్ సాధించావు.. నీ మీద, కావ్య అభ్యర్థిత్వంపై ఉద్యమకారులు, దళిత సంఘాలు వ్యతిరేకించినా వారిని ఒప్పించాం.. కానీ, రాత్రికి రాత్రే కాంగ్రెస్‌తో ప్రత్యేక ప్యాకేజీ మాట్లాడుకొని నువ్వూ, నీ బిడ్డ ఓ లేఖను విడుదల చేయడం సిగ్గుచేటు.. నీ సినియార్టీని గౌరవించిన కేసీఆర్ డిప్యూటీ సీఎం పదవి ఇస్తే ఇంతటి దిగజారుడు రాజకీయం చేస్తావా'' అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి లాంటి నీచమైన చరిత్ర ఉన్న నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన శ్రీహరి వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### శ్రీహరిది దిగజారుడు రాజకీయం : పెద్ది

బీఆర్ఎస్‌లోకి వచ్చి అన్ని పదవులు అనుభవించిన శ్రీహరి దిగజారుడు రాజకీయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్‌లో నెల రోజులుగా జరుగుతున్న పరిణామాలకు శ్రీహరే బాధ్యుడన్నారు. ఇప్పటి వరకు ఏ రాజకీయ నాయకుడు కూడా ఇన్ని పదవులు అనుభవించలేదన్నారు. గులాబీ వనం లో చీడపురుగులా కడియం మారాడాన్నారు. ఉద్యమ కాలమంతా టీడీపీలో ఉండి తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన కడియంకు కేసీఆర్ ఎంపీ పదవి, ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ చరిత్రలో కడియం ఏనాడూ పదవి లేకుండా లేరన్నారు. ఇన్ని పదవులు అనుభవించేందుకు ఎందరో దళిత, ఉద్యమ నాయకులు త్యాగాలు చేశారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రేపటి నుంచి కాంగ్రెస్‌లో కూడా ఇద్దరిని కలువనియ్యరని గుర్తుచేశారు. రేపు స్టేషన్‌ఘన్‌పూర్‌లో నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం పెడుతున్నామని, కార్యకర్తలు అందరు కేసీఆర్ వెంటే ఉన్నారని పెద్ది అన్నారు.



కడియం దిష్టిబొమ్మను చెప్పుతో కొడుతున్న బీఆర్ఎస్ నాయకులు

### బీఆర్ఎస్‌కు నష్టమేమీ లేదు : జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

దళితద్రోహి కడియం పార్టీ మారితే బీఆర్ఎస్‌కు జరిగే నష్టం ఏమీ లేదని జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ అన్నారు. రేవంత్‌రెడ్డిపై శ్రీహరి అసెంబ్లీలో మాట్లాడిన నీతి మాటలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. దళితులను ఎదగకుండా హింసించిన చరిత్ర కడియంది అని అన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణను అభాసుపాలు చేసేందుకు దుష్ట శక్తులన్నీ ఏకమవుతున్నాయన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. అనంతరం మైనార్టీ నేత నయీమొద్దీన్ ఆధ్వర్యంలో కడియం దిష్టిబొమ్మను దహనం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, ఉద్యమ నాయకులు జోరిక రమేశ్, వీరేందర్, బండి రజిని, నాయకులు పులి రజినీకాంత్, రవీందర్‌రావు, పరశురాములు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో భారీ నష్టం

**రెండు ఇన్సూరెన్స్ ఆఫీసులు, మరో రెండు కన్వెన్షన్ హాల్స్ దగ్ధం.. జకోటియా కాంప్లెక్స్‌లో బూడిదైన ఫర్నీచర్, ఇతర సామగ్రి**

పోచమ్మమైదాన్, మార్చి 29: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని జకోటియా కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరగ్గా భారీగా నష్టం వాటిల్లింది. కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులో ఉన్న ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ వరంగల్ డివిజన్ కార్యాలయం, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్యాలయం, పక్కనున్న బిలీఫ్ బాంక్వెట్ హాల్, మూడో అంతస్తులో ఉన్న వద్దిరాజు కన్వెన్షన్ మినీ హాల్, డీ కన్వెన్షన్ హాల్‌లోని సామగ్రి, స్టేషనరీ మొత్తం కాలి బూడిదయ్యాయి. ఫైర్ సిబ్బంది, కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా తెల్లవారుజామున 2గంటలకు మంటలు అదుపులోకి తెచ్చారు. కాగా, శుక్రవారం ఉదయం 6 గంటలకు మళ్లీ మంటలు చెలరేగాయి. స్టార్ ఇన్సూరెన్స్ పక్కనున్న కంది చిట్‌ఫండ్‌లోకి మంటలు వ్యాపించాయి. దీంతో ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమై ఫైరింజిన్లు రప్పించి మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీస్ క్లూస్, ఫోరెన్సిక్ టీమ్స్ పరిశీలించారు. డీసీపీ బారీ, ఏసీపీలు నందిరాంనాయక్, సత్యనారాయణ, డివిజనల్ ఫైర్ ఆఫీసర్ భగవాన్‌రెడ్డి, ఎస్ఎఫ్‌వో రవీందర్, సీఐలు తుమ్మ గోపి, శ్రీధర్ పర్యవేక్షించారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ట్రాఫిక్‌ను మళ్లించారు. జకోటియా కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్, మూడు ఫ్లోర్లలో సుమారు 190 షాపులు ఉండగా, భారీ అగ్ని ప్రమాదం నేపథ్యంలో షాపులను మూడు రోజులపాటు ఎవరూ తెరవద్దని అధికారులు ఆదేశించారు. అగ్ని ప్రమాద స్థలిని అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, బీజేపీ వరంగల్ అధ్యక్షుడు గంట రవికుమార్ సందర్శించారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.10కోట్ల వరకు నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. కాగా, ఈ ఘటనపై విచారణ జరిపించాలని కోరుతూ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ డివిజనల్ సేల్స్ మేనేజర్ ఎం.అనిల్‌కుమార్ మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదంలో అస్వస్థతకు గురైన మట్టెవాడ సీఐ తుమ్మ గోపి ఎంజీఎం దవాఖానలో కోలుకున్నారు. ఫైర్ హోంగార్డు గిరి చేయి విరగడంతోపాటు కాలిన గాయాలు కాగా చికిత్స పొందుతున్నారు.



దగ్ధమైన జకోటియా కాంప్లెక్స్ ముందుభాగం

# వన్యప్రాణులకు నీటి వసతి

**'సోలార్ బోర్'లకు మరమ్మతులు**

**కుంటలో నీటిని నింపిన అటవీ శాఖ అధికారులు**




వాటర్‌ట్యాంకర్‌తో సాసర్ పిట్స్‌లో నీటిని నింపుతున్న సిబ్బంది

మహదేవపూర్, మార్చి 29 : వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 26న 'నమస్తే తెలంగాణ'లో 'వన్యప్రాణుల దాహం తీరేదెలా' శీర్షికన ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. మహదేవపూర్ అటవీ ప్రాంతంలో పనిచేయని సోలార్ బోర్లకు తాత్కాలిక మరమ్మతులు చేసి గుంటోనికుంటలో నీరు నింపారు. వాటర్ ట్యాంకర్ సాయంతో సాసర్ పిట్స్, వాటర్ హోల్స్‌లో నీటిని నింపి అందుబాటులోకి తీసుకొచ్చారు. నీటి కుంటలు, సాసర్ పిట్స్‌లో ఎప్పటికప్పుడు నీరు నింపాలని సిబ్బందిని ఆదేశించినట్లు మండల అటవీ క్షేత్ర అధికారి కమల తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



కుంటలో నీటిని నింపుతున్న అటవీశాఖ అధికారులు





ప్రధాన నిందితుడు వీరేశం అరెస్టును చూపిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి, (ఫైల్) స్వాధీనం చేసుకున్న గోల్డ్, బ్యాంకు పాస్ బుక్‌లు, రూ.71వేల నగదు, మూడు పాస్‌పోర్టులు

# గ్రూప్-1 ఉద్యోగాల పేరుతో భారీ మోసం

**ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.4.5 కోట్ల వసూళ్లు**

**ప్రధాన నిందితుడు కొత్త వీరేశం అరెస్ట్**

**రూ.25లక్షల విలువైన గోల్డ్, రూ.71వేల నగదు స్వాధీనం**

**హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడి**

సుబేదారి, మార్చి 29 : గ్రూప్-1 ఉద్యోగాలు ఇప్పిస్తామని ఓ ముఠా కోట్ల తెలుగు రాష్ట్రాల్లో రూపాయల వసూళ్లకు పాల్పడింది. ప్రధాన నిందితుడు కొత్త వీరేశం అరెస్టుతో ముఠా మోసాలు వెలుగులోకి వచ్చాయి. శుక్రవారం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో హనుమకొండ ఏసీపీ జితేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. వరంగల్ పిన్నావారి వీధికి చెందిన కొత్త వీరేశం మొదట్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు పైరవీలు చేసి డబ్బులు తీసుకునేవాడు. కానీ ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశ కలిగింది. వీరేశం కుమారుడు గోపీనాథ్‌కు హైదరాబాద్ ఎల్‌బీనగర్ రాక్ టౌన్ కాల నీకి చెందిన గూడూరు పవన్‌కుమార్‌తో పరిచయం ఉంది. ఈ క్రమంలో వీరేశం, పవన్‌కుమార్ ప్రతిమ హాస్పిటల్ డాక్టర్లు బొమ్మన రఘునందన్‌రావు, బోయినపల్లి రవీందర్‌రావు, ఊటుకూరి శ్రీనివాస్‌రావును పరిచయం చేసుకున్నారు. వైద్యుల పేరుతో వీరేశం, పవన్‌కుమార్ ఏపీ, తెలంగాణలో ప్రముఖులు, ఉన్నతాధికారులను కలిసేవారు. ఈ క్రమంలో గ్రూప్-1 ఉద్యోగాలు ఇప్పిస్తామని వీరేశం, పవన్‌కుమార్, అడ్వకేట్ ఊటుకుని శ్రీనివాస్‌రావు, గోపీనాథ్, ఏపీకి చెందిన రాజకీయ పార్టీలతో సంబంధాలు ఉన్న బుచ్చిబాబు అలియాస్ బుచ్చయ్య, పవన్‌కుమార్ భార్య పద్మజ, ఊటుకూరి శ్రీనివాస్‌రావు, బోయినపల్లి రవీందర్‌రావు, వీరేశం భార్య కొత్త అరుంధతి తెలుగు రాష్ట్రాల్లో చాలామంది నుంచి రూ.4.5కోట్ల వసూళ్లకు పాల్పడ్డారు. ముఠాలో ప్రధాన నిందితుడు వీరేశంను అరెస్ట్ చేసి విచారణ చేయగా ఈ భాగోతం వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి వరంగల్‌లో చాలాకాలం పనిచేసి మృతిచెందిన రిటైర్డు అడిషనల్ ఎస్పీ భాస్కర్‌రావు భార్య శ్రీదేవి కూడా ముఠా బాధితుల్లో ఉన్నారు. శ్రీదేవి తన కుమారుడికి ఏపీలో గ్రూప్-1 పోస్ట్ కోసం రూ.2.5కోట్లు ఇచ్చినట్లు పోలీసు విచారణలో తేలింది. పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతున్నదని ఏసీపీ తెలిపారు. కాగా, పోలీసులు వీరేశం నుంచి రూ.25లక్షల విలువైన బంగారు ఆభరణాలు, బ్యాంకు పాస్‌బుక్‌లు, ప్రామిసరీ నోట్స్, 3 పాస్‌పోర్ట్‌లు, రూ.71,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.